


మాట్లాడుతున్న కేంద్ర పరిశోధన బృందం నాయకుడు ఆచార్య సుందరరామ్



గ్రామస్థులతో మాట్లాడుతున్న బృంద సభ్యులు

## కోరుకొండ పంచాయతీ మానవ వనరుల స్థితిగతులపై

# కేంద్ర పరిశోధన బృందం అధ్యయనం

విజయనగరం (ఫోర్టు), మార్చి 6: దేశంలోని గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులు, మానవ వనరుల స్థితిగతులపై అధ్యయనం చేసి వాస్తవ పరిస్థితులను కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖకు నివేదించేందుకు ఏర్పాటైన కేంద్రపరిశోధన బృందం గత రెండు రోజులుగా విజయనగరం మండలం కోరుకొండ గ్రామ పంచాయతీని సందర్శించింది. కేంద్ర పరిశోధనా బృందం నాయకుడు ఆచార్య డి.సుందరామ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల బృందం కోరుకొండ గ్రామంలో మౌలిక వసతులైన మంచినీరు, రోడ్లు, మరుగుదొడ్లు, పాఠశాలలు, ఆరోగ్య ఉపకేంద్రం, వర్మీ కంపోస్టు కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు పంచాయతీ కార్యాలయానికి సంబంధించిన పత్రాలను, సమాచారాన్ని సేకరించింది.

కోరుకొండ పంచాయతీ సర్పంచ్ లగుడు శివాజీ, వార్డుసభ్యులతో పరిశోధన బృందం ప్రత్యేకంగా సమావేశమై ప్రస్తుతం పంచాయతీలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, భవిష్యత్ ప్రణాళిక అమలుపై వారి ఆలోచనలను, మనోభావాలను, సమస్యలను అడిగి తెలుసుకుంది. అలాగే పంచాయతీ కార్యదర్శి బి.అవతారం, ఇతర సిబ్బందితో పరిశోధన బృందం విడిగా సమావేశం నిర్వహించి పంచాయతీ పరిపాలనలో ఎదురవుతున్న సమస్యలను, వాటి పరిష్కారానికి కావలసిన ప్రత్యామ్నాయాల గురించి చర్చించి నమోదు చేసింది.

అదేవిధంగా కోరుకొండ పంచాయతీకి భవిష్యత్ మౌలిక వసతులు, మానవ వనరుల గురించి గ్రామస్తులతో పరిశోధన బృందం విపులంగా చర్చించి, వాటి సాధనకు తీసుకోవలసిన చర్యలు, సలహాలను స్వీకరించింది. గత రెండు రోజులుగా కోరుకొండ పంచాయతీని సందర్శించిన కేంద్ర పరిశోధన బృందం వాస్తవ పరిస్థితులపై వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించి, క్రోడీకరించి నివేదిక రూపంలో కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ, జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థకు సమర్పిస్తామని బృంద నాయకుడు ఆచార్య సుందరరామ్, సభ్యులు డి.సాయికుమార్, డి ఎస్ భగవాన్‌రెడ్డి తెలిపారు.